నిధులున్నా.. నిర్మాణంలో జాప్యం

- పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు
- ఎల్లారెడ్డిపేట,వెంకటాపూర్‌లో నిత్యం అవస్థలే
- ఏది వచ్చినా ఊరు శివారుకు వెళ్లాల్సిందే
- శంకుస్థాపన చేసి వదిలేసిన వైనం



పబ్లిక్ టాయిలెట్ లేని ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్‌లో పబ్లిక్ టాయిలెట్స్ లేక ప్రయాణికులు, గ్రామీణులు, దుకాణదారులు పరేషాన్ అవుతున్నారు. వ్యాపార లావాదేవీలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో గిద్ద చెరువు కట్ట లేదంటే దుమాల శివారు చిట్టి వాగు వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఎల్లారెడ్డిపేట జనాభా 8,590 కాగా, మండల కేంద్రానికి చుట్టూ సుమారు 15 గ్రామాలతోపాటు వీర్నపల్లి మండలం నుంచి నిత్యం సుమారుగా పది వేల మంది వివిధ పనుల కోసం వచ్చి వెళ్తుంటారు. పనుల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్న సమయంలో అందుబాటులో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక వారు పడుతున్న బాధ వర్ణనాతీతం.

ఈ మూడు గ్రామాలు మేజర్ పంచాయతీలు అయినప్పటికీ పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలను పట్టించుకోవడం లేదు. రెండు గ్రామాల్లో కలిపి రూ.14 లక్షలు వెచ్చిస్తే అధునాతన పద్ధతిలో పబ్లిక్ టాయిలెట్స్ అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. పంచాయతీరాజ్, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయంతీ అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లనే మూత్రశాలల నిర్మాణంలో జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

సమన్వయ లోపం

పబ్లిక్ టాయిలెట్‌లు నిర్మాణానికి అవసరమైన నిధులున్నా అధికారుల మధ్య సమన్వయ లోపంతో నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఎల్లారెడ్డిపేటలో మోడ్రన్ టాయిలెట్స్ ఏర్పాటు చేయడానికి రూ.7 లక్షల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. గ్రామ పంచాయితీ నుంచి నిధులు కూడా కేటాయించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ఏడాది క్రితం శంకుస్థాపన చేశారు. పంచాయితీరాజ్ శాఖ అధికారుల నుంచి డిజైనింగ్‌తో పాటు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో పనులు చేపట్టడం లేదు. ఫలితంగా ప్రజలకు నిత్యం ఇబ్బంది తప్పడం లేదు.

చెప్పుకోలేని బాధ

జిల్లావ్యాప్తంగా ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ఇల్లంతకుంట, చందుర్తి, వీర్నపల్లి, కోనరావుపేట మండల కేంద్రాల్లో పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రాల్లో బస్టాండ్ ఉన్న చోట అరకొర వసతుల మధ్య మరుగుదొడ్లు ఉన్నాయి, జిల్లాలోని 8 మండల కేంద్రాల్లో సుమారు రెండు వేల వ్యాపార దుకాణాలు ఉండగా, ఆయా కేంద్రాలకు గ్రామాల నుంచి నిత్యం వ్యక్తిగత పనులు, వ్యాపారాల కోసం సుమారు లక్ష వరకు జనం వచ్చి వెళ్తుంటారు. కాగా గ్రామ పంచాయతీల పరిధిలో రాచర్ల గొల్లపల్లి, ముస్తాబాద్‌లో తప్ప ఎక్కడ కూడా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించలేకపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీల పరిధిలో పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



వ్యాపారరీత్యా గంటల తరబడి దుకాణంలో ఉండి మూత్రశాలకు వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నాం. స్థానికంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక దుకాణాలకు వచ్చే ప్రజలు కూడా బాధలు చెప్పుకోలేకపోతున్నారు. శంకుస్థాపన చేసి ఇప్పటివరకు ఏర్పాటు చేయలేకపోయారు. అందుబాటులో పబ్లిక్ టాయిలెట్ నిర్మించి ఇబ్బందులు తొలగించాలి.

– దేవేందర్, వ్యాపారి, ఎల్లారెడ్డిపేట

పనులు చేపడతాం



పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుకు నిధులు కేటాయించాం. పంచాయితీరాజ్ అధికారులు డిజైనింగ్ పంపి వెంటనే పనులు చేపడతాం. రూ.7 లక్షల వరకు ఖర్చు చేసి మోడ్రన్‌గా టాయిలెట్ నిర్మించాలని నిర్ణయించాం. టాయిలెట్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు వాస్తవమే ప్రజల సహకారంతో అందుబాటులోకి తెస్తాం.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం



ప్రారంభిస్తున్న ఎంపీపీ మల్లేశంయాదవ్

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లి గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ బండ మల్లేశం యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్కం మల్లేశం, వైద్యాధికారులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, గ్రామ వార్డు సభ్యులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలంలోని శాంతినగర్‌లో సర్పంచ్ కముటం మల్లేశం ప్రారంభించారు. డాక్టర్ వెంకటేశ్, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామంలో సోమవారం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు స్థానిక ఎంపీటీసీ బైరినేని రాము, రైతుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగనాయక సాగర్ ద్వారా దాచారం చెరువు తద్వారా చిన్నలింగాపూర్, నర్సింహులపల్లె, బాలమల్లుపల్లె, సోమయ్య చెరువుకు నీళ్లు అందించి సుమారు 500 మంది రైతుల పొలాలు ఎండిపోకుండా కాపాడిన మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీ బైరినేని రాము బీజేపీ నాయకుడు కావడం విశేషం. కార్యక్రమంలో నాయకులు పిట్ల రవి, గుర్రం రవి, రాజేశ్వర రావు, రవి, బాలరాజు, పోచయ్య, విఠల్, వెంకటేశ్ , గ్రామ రైతులు పాల్గొన్నారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన ముదిరాజ్ నాయకులు



బండ ప్రకాశ్‌ను సన్మానిస్తున్న అంతయ్య

తంగళ్లపల్లి: శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్‌ను సోమవారం ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కోడి అంతయ్య ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో కలిసి గజమాలతో సన్మానించారు. ముదిరాజ్‌లను గుర్తించి డిప్యూటీ చైర్మన్ పదవి ఇచ్చిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ జిల్లా నాయకులు రాయిని ప్రతాప్, పల్లి మధు, రాం గోపాల్, గొడుగు శంకర్, చిగురు నరేశ్, నీరటి బాబు, బల్లెపు ప్రశాంత్, దేవుని రమేశ్, బోయిన చంద్రయ్య, లక్ష్మీనారాయణ, గోగుల నర్సయ్య, గడ్డమీద అంతయ్య పాల్గొన్నారు.

ముందస్తు మహిళా దినోత్సవం

- మహిళా ఉపాధ్యాయులు, కండక్టర్లు, ప్రయాణికులకు సన్మానం





సిరిసిల్ల, వేములవాడ బస్టాండ్‌లలో మహిళలకు సన్మానం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పాత, కొత్త బస్టాండుల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏడాది కాలంగా ఆర్టీసీలో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలను సన్మానించారు. డిపోకు ఈపీకే ప్రకారం అధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లు ఉమ, పద్మలకు ప్రశంసాపత్రాలను డిపో మేనేజర్ మనోహర్ అందించారు. మహిళా సిబ్బందికి చీరెలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో మేనేజర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా కండక్టర్లను, ఆరుగురు మహిళా ప్రయాణికులను సన్మానించారు. అనంతరం చీరెలను ఆర్టీసీ పారిశుధ్య మహిళా సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో వేములవాడ ఏరియా ఆసుపత్రి వైద్యురాలు దీప్తి, అలేఖ్య, నిక్షిప్త, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినులు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. హెచ్ఎం బండి ఉపేందర్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని రాంరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు గోల్కొండ స్వప్న, ఎస్.స్వప్నలను సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుముల జయవర్ధన్ విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక జెడ్పీహెచ్ఎస్ మహిళ ఉపాధ్యాయులను సోమవారం ఘనంగా సత్కరించారు. మహిళ ఉపాధ్యాయులు ఇంద్రాదేవి, జయశ్రీ, త్రివేణి, ఆరాధన, లావణ్య, రమ, శ్రీలతను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దబ్బెడ హన్మాండ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వీడ్కోలు హంగామా

ముస్తాబాద్: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సర్పంచ్ గాండ్ల సుమతి, ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్, విద్య కమిటీ చైర్మన్ గన్నె నర్సింలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

ఎల్లారెడ్డిపేట: హోలీ వేడుకల సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శేఖర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మహిళలపై రంగులు చల్లి ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని, రోడ్లపై వాహనాలు అడ్డంగా నిలుపరాదని సూచించారు. ప్రధాన కూడళ్ల వద్ద డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. బహిరంగంగా మద్యపానం సేవించరాదని సూచించారు.



కామ దహనం

ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రాల్లో కాముని పౌర్ణమి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఇంటింటికి పిడకలు సేకరించి, కామ దహనం చేశారు. మన్మథుడి మట్టి బొమ్మను దహనం చేశారు.

హోలీ వేడుకలు



గంభీరావుపేట/రుద్రంగి: మండలం దమ్మన్నపేట జెడ్పీహెచ్ఎస్, రుద్రంగి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సోమవారం ముందస్తు హోలీ సంబురాలు చేసుకున్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకుని సంతోషంగా హోలీ ఆడారు. రసాయనాలతో కూడిన రంగులు వాడవద్దని, వాటిని వాడడం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. సహజసిద్ధంగా లభించే రంగులనే వినియోగించాలని కోరారు.

విజ్ఞాన యాత్రలో విద్యార్థులు



సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి సోమవారం విజ్ఞాన యాత్రకు వెళ్లారు. చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక నిర్మాణాలు తదితర హైదరాబాద్ వైభవాన్ని ప్రత్యక్షంగా చూసి విద్యార్థులు ముచ్చటపడ్డారు. చార్మినార్, జామా మసీద్, చౌమహల్ ప్యాలస్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, లుంబినీ పార్కు, హుస్సేన్‌సాగర్ తదితర ప్రాంతాలు సందర్శించారు. యాత్రలో ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్, లెక్చరర్లు వాసరవేణి పరశురాం, అజ్మీర చంద్రశేఖర్, గెంట్యాల రాజశేఖర్, మల్లైవేని రవిందర్, కోడం శ్రీనివాస్‌తో పాటు సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిపై అలిగిన సర్పంచులు

తంగళ్లపల్లి: మంత్రి కేటీఆర్ తన పర్యటనలో భాగంగా తమ గ్రామానికి వస్తారని, అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని ఎదురుచూసిన ఆ రెండు గ్రామాల ప్రజలు నిరాశకు గురయ్యారు. మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీ, దేశాయిపల్లెలో ప్రగతి భవనం, పాఠశాల ప్రారంభించి, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి మంత్రి కేటీఆర్ భూమిపూజ చేయాల్సి ఉంది. కాగా ఆ రెండు గ్రామాలను పట్టించుకోకుండా బిజీ షెడ్యూల్ అంటూ మంత్రి వెళ్లిపోయారు. అదే సమయంలో మండలంలోని పలు గ్రామాల్లో నాయకుల ఇళ్లకు వెళ్లి గంటల తరబడి సమయాన్ని వెచ్చించడంతో ఆ రెండు గ్రామాల సర్పంచులు నిరాశకు గురయ్యారు. సారు వస్తున్నారని భారీగా ఖర్చు పెట్టి ఏర్పాట్లు చేస్తే రాకపోవడంతో అటు పైసలు పాయే.. ఊర్లో పరువు పాయే అని వారు నిట్టూరుస్తున్నారు. మంత్రి కేటీఆర్ కావాలనే తమ గ్రామాలను పట్టించుకోలేదని అలకబూనారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి నిరుపేద విద్యార్థులకు న్యాయం చేయాలని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు గజ్జెల దేవరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మారుమూల ప్రాంతమైన ఇల్లంతకుంటలో ఇంటర్ వరకే ఉండటంతో డిగ్రీ చదివేందుకు విద్యార్థులు కరీంనగర్, సిద్దిపేట, సిరిసిల్ల వంటి పట్టణాలకు వెళ్తున్నారని, ఆర్థిక స్తోమత లేక కొంతమంది విద్యార్థులు మధ్యలోనే చదువు వదిలేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు సోమవారం పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏంపీటీసీలు నాగరాణి, అనసూయ, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని శాంతినగర్ గ్రామంలో భూక్య జగన్‌కు రూ. 60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సర్పంచ్ కముటం మల్లేశం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడరూరల్: బ్యాంకులు ఇచ్చిన రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ పండుగ తిరుపతి అన్నారు. మల్లారం గ్రామంలో మహిళా సంఘాలకు హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, మల్లేశం, లక్ష్మి, గ్రామ మహిళా సంఘ సభ్యులు ఉన్నారు.

జనహితకు ఒకే ఒక దరఖాస్తు

వీర్నపల్లి: మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే జనహిత కార్యక్రమానికి సోమవారం ఒకే ఒక దరఖాస్తు వచ్చినట్లు ఎమ్మార్వో తఫజుల్ హుస్సేన్ తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీవో చంద్రయ్య సోమవారం పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించడం జరుగుతుందన్నారు. గొల్లపల్లిలో హరిత నర్సరీని పరిశీలించి, మొక్కలకు రోజుకు రెండుసార్లు నీరు పట్టాలని కూలీలకు సూచించారు.

నియామకం

వీర్నపల్లి మండల ఏపీఎంగా నర్సయ్య

వీర్నపల్లి: మండల ఏపీఎంగా నర్సయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏపీఎం శ్రీకాంత్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళ సంఘాల అభివృద్ధికి పాటుపడుతానన్నారు. అలాగే మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు,

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అన్సారీ

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అన్సారీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వేములవాడ కమిషనర్ అన్వేశ్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో సిరిసిల్ల మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారిగా విధులు నిర్వహిస్తున్న అన్సారీకి కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు.

వ్యవసాయం

అగ్గితెగులు నివారణ చర్యలపై అవగాహన



వరి చేలో ఏఈవో శ్రీదేవి

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్, కొత్తపేట, కోరెం, బోయినపల్లి గ్రామాల రైతుల వరి చేలను ఏఈవోలు శ్రీదేవి, రజిత, రవళి, సాహితీలు క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరి చేలలో అగ్గి తెగులు నివారణ చర్యల గూర్చి రైతులకు అవగాహన కల్పించారు.

ఉమెన్స్ డే గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొనాలి



మొక్క నాటుతున్న జెడ్పీటీసీ ఉమ

బోయినపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ఈ నెల 8న మహిళలు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ అన్నారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ పిల్లలను పెంచిన చేతులు మొక్కలను పెంచితే పరవశించి పోతాయన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఉన్నారు.

ప్రీతికి న్యాయం చేయాలి



బోయినపల్లి: దీక్ష చేస్తున్న రవీందర్‌రెడ్డి

బోయినపల్లి: మేడికో ప్రీతికి న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ చేస్తున్న దీక్షకు మద్దతుగా మండల బీజేపీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి మంగళవారం తడగొండ గ్రామంలోని తన ఇంట్లో నిరసన దీక్ష చేశారు. ప్రీతి మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

ఫ్లెక్సీల చించివేతపై పోలీసులకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: ప్రజాస్వామ్య రాజ్యంలో ఓ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడంపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక రాజకీయ పార్టీకి చెందిన ఫ్లెక్సీలను మరొక పార్టీకి చెందిన వ్యక్తులు చించివేసి ధ్వంసం చేయడం అవివేకమైన చర్య అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెరుకు ఎల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.